క్లుప్తంగా

నాచగిరి.. వ్రతసిరి



వ్రతమాచరిస్తున్న దంపతులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ నాచగిరి పుణ్యక్షేత్రంలో మూడోరోజు సోమవారం సత్యదేవుని వ్రతాలతో సందడి నెలకొంది. శనివారం 103 వ్రతాలు, ఆదివారం 115 వ్రతాలు జరగగా, సోమవారం 56 వ్రతాలు జరిగాయి. మూడు రోజులలో 274 వ్రతాల ద్వారా ఆలయానికి రూ.1.37లక్షల ఆదాయం సమకూరింది. అధిక సంఖ్యలో దంపతులు సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి పర్యటన



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండలంలో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ముత్తన్నపేట శివారులోని లక్ష్మీ కాటన్ మిల్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నూతన గ్రామ పంచాయతీగా ప్రకటించిన రామసాగరంలోని పాఠశాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన జీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మంజుల, రత్నాకర్‌రెడ్డి, పోచయ్య, శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున్, చైన్నారెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు అందుకుంటున్న విద్యార్థులు

దుబ్బాకటౌన్: స్థానిక వివేకానంద విద్యాలయనికి చెందిన విద్యార్థులు కరాటేలో బంగారు పతకాలు గెలుపొందారని కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్ హాల్లో జాతీయస్థాయి కరాటే కుంగ్ ఫూ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో సుమారు 800 మంది విద్యార్థులు పాల్గొనగా గాయత్రి వివేకానంద పాఠశాలకి చెందిన నిశాల్, మనశ్విన్ బంగారు పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను సురేందర్, సాయికుమార్, అమర్ సింగ్ అభినందించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



పరామర్శిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుక్కాపూర్‌లో అనారోగ్యంతో మరణించిన చిక్కుడు నర్సింహులు, కాన్గల్‌లో అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన ముడికె యాదయ్య కుటుంబాలను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌రెడ్డి, స్వామి, మాజీ ఎంపీటీసీ సత్తయ్య, నరేందర్‌రెడ్డి, కనకయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని దాచారం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, నాయకులు నర్సింహులు, రాములుగౌడ్, చెన్నారెడ్డి, యాదగిరి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్టను మాయం చేసిండ్రు!



జామ్లాతండాలో తవ్వకానికి గురైన గుట్ట



ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- కొనసాగుతున్న దందా
- పట్టించుకోని అధికారులు

కోహెడరూరల్(హుస్నాబాద్): అనుమతులు లేవు.. అడిగే వారూ లేరు.. ఇంకే ముంది లక్షల విలువచేసే మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలించేస్తున్నారు. మండలంలోని ధర్మాసాగర్‌పల్లిల్లోని జామ్లానాయక్ తండాలోని గుట్టను కొందరు అక్రమార్కులు తమ ఇష్టానుసారం ధ్వంసంచేసి అక్రమంగా మట్టి తవ్వేస్తున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోనే జరుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, వాళ్లకు సహకరిస్తున్నారేమోనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కరిగిపోతున్న గుట్టలు

కళ్లుమూసి.. తెరిచేలోపు కోహెడ మండలంలో గుట్టలకు గుట్టలే మాయం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో జేసీబీ, లారీలతో దర్జాగా తవ్వేసి తరలించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరుఎత్తన్నట్లు వ్యవహరించడంతో మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫీయా ఆగాడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కష్టసుఖాల్లో అండగా ఉంటా..

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాకలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక/మిరుదొడ్డి(దుబ్బాక): పేదల కష్టసుఖాల్లో అండగా ఉంటానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. తన క్యాంపు కార్యాలయంలో పలు బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం 12వ వార్డు కౌన్సిలర్ బట్టు యాదమ్మ ఎల్లం తండ్రి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి ఇంట్లో జరిగిన పూజల్లోను, దుంపలపల్లి, పెద్దగుండవెల్లి, చిన్ని జాంపేట గ్రామాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, స్వామి, యాదగిరి, శ్రీనివాస్, శ్రీనివాస్, మల్లేశంగౌడ్, కృష్ణ, నారాగౌడ్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా మిరుదొడ్డికి చెందిన ఎండీ రఫియొద్దీన్, కోల పృథ్వీరాజ్‌కు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. మాజీ ఎంపీటీసీ భైరయ్య, మోతె మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



మిరుదొడ్డి(దుబ్బాక): మౌలానా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక)/గజ్వేల్‌రూరల్: దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. స్వాతంత్ర సమరయోధుడిగా, విద్యాశాఖ మంత్రిగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం కిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశ్వరి, బాలకృష్ణ, ఇందిర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యారంగానికి అబుల్ కలామ్ ఆజాద్ చేసిన సేవలు మరువలేనివన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు నివాళులర్పించారు.

మహిళల రక్షణకు పకడ్బందీ చట్టాలు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులతో సీఐ లతీఫ్, ఉపాధ్యాయులు

సీఐ లతీఫ్

కొండపాక(గజ్వేల్)/మిరుదొడ్డి(దుబ్బాక): మహిళల రక్షణ కోసం పకడ్బందీగా చట్టాలున్నాయని సీఐ లతీఫ్ అన్నారు. కొండపాక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అసభ్యకరంగా వ్యవహరిస్తే 100కు డయల్ చేయాలని చెప్పారు. బాలికలు, మహిళల కోసం షీటీమ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. పాఠశాల ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ గౌతమి, ఎస్ఐ శ్రీనివాస్, షీటీమ్, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మిరుదొడ్డిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా షీ టీమ్ సభ్యులు విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట షీ టీమ్ సభ్యులు కిషన్, మమత, వీణాకుమారి, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది సత్యనారాయణ, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు

తొగుట(దుబ్బాక)/దుబ్బాకరూరల్: రోడ్లపై ధాన్యం ఆరబెట్టి ప్రమాదాలకు కారణం కావొద్దని సీఐ లతీఫ్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని పెద్ద మాసాన్‌పల్లి శివారులో దుద్దెడ-తుక్కాపూర్ రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన రైతులకు ఆయన అవగాహన కల్పించారు. రైతులు కల్లాలు నిర్మించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ రవికాంత్‌రావు, ఏఈఓ నాగార్జున ఉన్నారు. దుబ్బాకరూరల్ మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామ శివారులో రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులకు ఎస్ఐ గంగరాజు అవగాహన కల్పించారు. రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై కాకుండా కల్లాల వద్దనే ఆరబెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబోసి నల్లటి కవర్‌లు కప్పడం వల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగి పలువురు వాహనదారులు ప్రాణాలు పొగొట్టుకుంటున్నారని చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి



పోచయ్య(ఫైల్)

గజ్వేల్‌రూరల్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ సోమవారం వివరాలు తెలిపారు. గ్రామానికి చెందిన పంపరి పోచయ్య(45) గత 5న ఉదయం చేపల వేటకు వెళ్లి ఇంటికి వచ్చి వలను ఇంటిపైన ఆరబెట్టాడు. కిందికి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఉమ

ములుగు(గజ్వేల్): గుండెపోటుతో తండ్రి మృతి చెందగా కూతురు అంత్యక్రియలు నిర్వహించింది. ఈ ఘటన ములుగు మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకున్నది. కుమ్మరి కృష్ణ(55)కు భార్య లత, కూతురు ఉమ ఉన్నారు. కృష్ణకు ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. అతడికి కుమారులు లేకపోవడంతో కూతురు ఉమ అంత్యక్రియలు నిర్వహించి తలకొరివి పెట్టింది. విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా ఆ కుటుంబ సభ్యులను పరమర్శించి, ఒక్కొక్కరు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

ఏపీఎం, సీసీలపై ఫిర్యాదు

సిద్దిపేటరూరల్: జగదేవ్‌పూర్ మండలంలోని వీఓఏలను వేధింపులకు గురిచేస్తున్న ఐకేపీ ఏపీఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మహిళా వీఓఏలు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ జగదేవ్‌పూర్ ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్, సీసీలు రమేశ్‌రెడ్డి, బాబు మహిళా వీఓఏలను తమ చాంబర్‌కు పిలిచి అసభ్యకరంగా మాట్లాడతున్నారన్నారు. ఏ మీటింగు లేకున్నా ఫోన్‌చేసి పీడీ మీటింగ్‌కు రావాలని వేధిస్తున్నారని, అలాగే ఏపీఎం, సీసీలు వీఓఏల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి తీసుకుని ఊరికి వెళ్లినా లైవ్ లొకేషన్ పంపించాలంటున్నారని, చర్యలు తీసుకుని వారిని తొలగించాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న వీఓఏలు

ట్రాన్స్‌కో.. జర దేఖో!



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

అక్కన్నపేట(హుస్నాబాద్): పంట పొలాల్లో, రోడ్డుకు రెండు వైపులా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు అల్లుకుపోయాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ కనిపించక ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు వాపోతున్నారు. మండల పరిధిలోని గౌరవెల్లి గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదలు, మొక్కలు దట్టంగా పెరిగాయి. చుట్టూ పంటపొలాలు ఉన్నాయి. అంతేకాక మూగజీవాలు మేతకోసం అక్కడే తిరుగుతుంటాయి. విద్యుత్ తీగలు కనిపించకపోవడం, రక్షణ వ్యవస్థలేకపోవడంతో పశువులు, రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు.. రైతుల ఇబ్బందులు



హుస్నాబాద్‌రూరల్: ఆర్‌కే జిన్నింగ్ మిల్లు వద్ద క్యూలో ఉన్న వాహనాలు

హుస్నాబాద్‌రూరల్/జగదేవ్‌పూర్(గజ్వేల్): జిల్లాలో జిన్నింగ్ మిల్లుల యాజమానులు, సీసీఐ అధికారుల మధ్య తలెత్తిన విభేదాలతో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. సమ్మె విషయం తెలియని రైతులు దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో తమ పత్తి తీసుకొని కొనుగోలు కేంద్రానికి వచ్చారు. అధికారులు కొనుగోళ్లు చేపట్టక పోవడంతో వాహనాలు బారులు తీరాయి. సాయంత్రం వరకు అక్కడే వేచి చూశారు. ఎట్టకేలకు జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్‌తో ప్రభుత్వ అధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో కొనుగోళ్లు ప్రారంభించారు. అలాగే జగదేవ్‌పూర్ మండలంలోని గొల్లపల్లి పత్తి మిల్లులోను కొనుగోళ్లు నిలిపి వేస్తున్నామని మిల్లు వద్ద నోటీసు అతికించారు. కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

తరలింపును వెంటనే విరమించాలి

మున్సిపల్ కార్మికుల డిమాండ్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని ఈపీఎఫ్ రిజినల్ కార్యాలయాన్ని తరలించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. రీజినల్ కమిషనర్ అన్వేష్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ ఈ కార్యాలయం ఎంతో మంది కార్మికులు, ఉద్యోగులకు అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈ ప్రాంత కార్మికులకు తీరని నష్టం జరిగే ప్రమాదం ఉందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు తరలిపోతుంటే ఎంపీ రఘునందరావు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తరలింపు ఆపకపోతే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. రాజయ్య, నరసమ్మ, రాజు, బాలయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు కమిషనర్ అవినాష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కార్యాలయాన్ని సిద్దిపేటలోనే కొనసాగించాలన్నారు.





ఇజ్‌నా మెహిరిన్, ఇఫ్రామెహిరిన్ తదితర చిన్నారులు ప్రదర్శిస్తున్న ఎగ్జిబిట్‌లు

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్

సిద్దిపేట: జిల్లా కేంద్రంలోని సెలెస్టీయల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ అంశాలపై ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ ఆలోచింపజేశాయి. ఇజ్‌నా మెహిరిన్, ఇఫ్రామెహిరిన్ తయారు చేసిన స్వచ్ఛభారత్, ట్రిగనామెట్రీ ఎగ్జిబిట్‌లు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు వై.హన్మంతరెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఏఆర్‌ఆర్ కృష్ణమాచారి ప్రదర్శనలను తిలకించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ కరీంనగర్ రోడ్డు ఫీడర్ పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ రోడ్డు, అయ్యప్ప ఆలయం, వడ్డెర కాలనీ, సూడా చౌరస్తా, లింగారెడ్డిపల్లి ఎక్స్ రోడ్డు, ఆర్టీఏ కార్యాలయం, సీసీ గార్డెన్ ప్రాంతాలలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో 20 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.35వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని రాజగోపాల్‌పేట ఉన్నత పాఠశాల హెచ్ఎం కనకయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలో ఎ.వైష్ణవి, వచన కవితా పోటీలో వినీత్ బహుమతులకు ఎంపికయ్యారన్నారు. వారికి 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తారని చెప్పారు.

◆ నేత్ర వ్యాధులపై అవగాహన

నంగునూరు(సిద్దిపేట): నేత్ర వ్యాధులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ అన్నారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం కళాశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పావని, పవన్, బాలకిషన్ పాల్గొన్నారు.

◆ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దుబ్బాకరూరల్: ఇటీవల సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్-17 బాలికల డిస్కస్ త్రో పోటీలలో చీకోడ్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి భావన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు భానుకుమార్ తెలిపారు. హెచ్ఎం జానకిరాములు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

◆ మున్సిపల్ సర్వసభ్య సమావేశం

చేర్యాల(సిద్దిపేట): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ స్వరూపరాణి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. శానిటేషన్, నీటి సరఫరా, విద్యుత్ దీపాలు, సీసీ రోడ్ల మరమ్మతులు వంటి అంశాలపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు కమిషనర్ నాగేందర్ తెలిపారు. కౌన్సిలర్లు చంటి, నరేందర్, తార, ఇన్నమ్మ, లీల, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సమగ్ర సమాచారం ఇవ్వాలి

నంగునూరు(సిద్దిపేట): సర్వే కోసం ఇంటికి వచ్చే అధికారులకు పూర్తి సమాచారం అందించి సహకరించాలని డీపీఓ దేవకీదేవి ప్రజలకు సూచించారు. నంగునూరులో నిర్వహిస్తున్న సర్వేను సోమవారం ఆమె పరిశీలించారు.

◆ చదువుకు పేదరికానికి అడ్డుకావొద్దు

చిన్నకోడూరు(సిద్దిపేట): అడ్డంకులను అధిగమిస్తూ విద్యార్థులు ముందుకు సాగాలని తోట ఫౌండేషన్ డైరెక్టర్ ఆవుల శ్రావణ్ పిలుపునిచ్చారు. పదోతరగతి, ఇంటర్‌లో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మండల పరిధిలోని అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి భాస్కర్, ఫౌండేషన్ సభ్యులు రవీందర్ రెడ్డి, పరమేశ్వర్, తిరుపతి, హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సీపీఎం మండల కార్యదర్శిగా రవికుమార్

సిద్దిపేటఅర్బన్: సీపీఎం సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శిగా పట్టణానికి చెందిన రవికుమార్ నియామకమయ్యారు. సోమవారం జరిగిన మహాసభలో 13 మందితో నూతన కమిటీని ఎంపిక చేశారు.

◆ 'దేశిని'కి ఘన నివాళి

కోహెడ(హుస్నాబాద్)/హుస్నాబాద్: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్నమల్లయ్య వర్ధంతిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేర్యాల రవీందర్ రావు, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నేత వీందర్ గౌడ్, మల్లికార్జున్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, హరీశ్, శంకర్, శ్రీనివాస్, తిరుపతి, మల్లయ్య, మల్లేశంగౌడ్, రాజయ్య పాల్గొన్నారు.